సాక్షి
కుమురం భీం
గురువారం । 9 । మే । 2024



పాకురు నీళ్లలో ఈదేదెలా?
రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్ అస్తవ్యస్తంగా మారింది. నీళ్లు ముదురు ఆకుపచ్చ రంగులో దర్శనమిస్తున్నాయి. IIలో▸



తగ్గనున్న దూరభారం
పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు అందుబాటులో తాత్కాలిక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్లకు దూరభారం తప్పనుంది. IIIలో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.1 /27.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ వేడి స్వల్పంగా తగ్గుతుంది. సాయంత్రం పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో

దహెగాం(సిర్పూర్): వానాకాలం సీజన్ సమీపిస్తున్నందున ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంతోపాటు ఐనం, బీబ్రా, ఒడ్డుగూడ, చినరాస్పెల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. యూరియా స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే యూరియా అధిక ధరలకు విక్రయించినా లైసెన్సు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం లగ్గాం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. తేమ శాతం 17 కంటే మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏవో వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

'ఉద్దెర హామీలతో మోసం చేస్తున్న కాంగ్రెస్'




ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దెర హామీలతో ప్రజలను మోసం చేస్తోందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. మండలంలోని జక్కులపెల్లి, కొమురవెల్లి, నారాయణపూర్, రాజారాం, నంబాల, పులికుంట, రోళ్లపాడు, తక్కళ్లపల్లి గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయకుండా దేవుళ్ల మీద ఒట్లు వేస్తోందని, కేంద్రంలోని బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందన్నారు. ఇలాంటి పార్టీలు ప్రజలకు ఏం న్యాయం చేస్తాయని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాక అప్పుడు రైతుభరోసా డబ్బులను రైతుల ఖాతాలో జమ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వనజ, నాయకులు రాజేశ్వర్‌రావు, అహల్యాదేవి, అన్నపూర్ణ అరుణ, ఆనంద్ పాల్గొన్నారు.

'పది' తర్వాత విస్తృత అవకాశాలు
కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులకు విస్తృతమైన విద్యావకాశాలు ఉంటాయని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ చక్రపాణి అన్నారు. కాగజ్‌నగర్‌లోని ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌ను బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల ద్వారా వివిధ అవకాశాలు కల్పిస్తుందన్నారు. పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, కష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా నిలవాలని సూచించారు. కోఆర్డినేటర్ కటుకం మధుకర్, మామిడాల శ్రీశైలం, శ్యాంసుందర్, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు మద్దతుగా బుధవారం ఆసిఫాబాద్ మండలం బూర్గుడ నుంచి జిల్లా కేంద్రం వరకు బీజేపీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రధానిగా మోదీకి మరో అవకాశం ఇవ్వాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీపీ మల్లికార్జున్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, నాయకులు శ్రీను, నగేశ్, శ్రీధర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



దహెగాం మండల కేంద్రానికి చెందిన దాసరి వెంకటి యాసంగి సీజన్‌లో మూడెకరాల్లో వరి సాగు చేశాడు. పది రోజుల క్రితం పంట కోశాడు. సుమారు 60 క్వింటాళ్ల వరకు ధాన్యం రాగా.. స్థానిక కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టాడు. మంగళవారం తూర్పార పడుతున్న సమయంలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. కుప్పపై టార్పాలిన్ కప్పినా వరదకు ధాన్యం తడిసిందని రైతు వాపోయాడు.



ఆసిఫాబాద్ మండలం అప్పపల్లికి చెందిన కోట్రంగి సంతోష్ రెండెకరాల్లో వరి సాగు చేశాడు. ఇప్పటివరకు మొత్తం రూ.65 వేల పెట్టుబడి పెట్టాడు. మంగళవారం గాలివాన, అకాల వర్షంతో పంట చేతికందే సమయంలో వరి పైరు నేలవాలింది.



పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన అకిరెడ్డి బాపు మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. మంగళవారం కురిసిన అకాల వర్షానికి కోతకు వచ్చిన వరి నేలవాలింది. రాళ్ల వానకు ధాన్యం రాలిపోయింది.

అకాల నష్టం!



దహెగాంలోని కొనుగోలు కేంద్రంలో వరద నీరు

- భారీ వర్షానికి నేలవాలిన వరి
- 1000 ఎకరాల్లో నష్టం అంచనా
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- కొనుగోళ్లలో జాప్యంతో రైతులకు ఇబ్బందులు



దహెగాంలో నేలవాలిన వరి

దహెగాం(సిర్పూర్): ఇప్పుడిప్పుడే జిల్లాలో కోతలు వేగవంతం అయ్యాయి. రైతులు ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకుంటున్నారు.. ఇలాంటి తరుణంగా మంగళవారం కురిసిన అకాల వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఓ వైపు పొలాల్లోని చేతికందే దశలో ఉన్న వరి నేలవాలగా.. కుప్పలుగా ఆరబెట్టిన ధాన్యం తడిసింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

70 శాతం కోతలు పూర్తి..

వాతావరణం కలిసిరాక.. తెగుళ్ల కారణంగా వానాకాలం సీజన్‌లో పంటల దిగుబడి తీవ్రస్థాయిలో తగ్గింది. యాసంగిలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నా.. అన్నదాతలు వరిపై ఆశలు పెట్టుకున్నారు. ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి, దహెగాం, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూర్ మండలాల్లో వరి సాగు ఉంది. మిగిలిన మండలాల్లో మొక్కజొన్న, జొన్న, కూరగాయల సాగు చేశారు. జొన్న, మొక్కజొన్న పంట కోతలు దాదాపు పూర్తయ్యాయి. 18 వేల ఎకరాల్లో సాగు చేసిన వరి కోతలు ఇప్పటి వరకు 70 శాతం వరకు పూర్తికాగా.. మరో 30 శాతం కోతలు పూర్తి కావాల్సి ఉంది. మంగళవారం కురిసిన అకాల వర్షానికి పంటలకు నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవడంతోపాటు పొలాల్లోని వరి పైరు నేలవాలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో కోతలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అకాల వర్షానికి జిల్లాలో సుమారు 1000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. దహెగాం, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ మండలాల్లో అధికంగా వరి దెబ్బతింది.

నెమ్మదిగా కొనుగోళ్లు..

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం ఏప్రిల్ 1న జిల్లా వ్యాప్తంగా 37 కేంద్రాలను ప్రారంభించారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 46,800 టన్నులు కాగా.. ఇప్పటివరకు 510 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. 37 కొనుగోలు కేంద్రాల్లో కేవలం ఐదు చోట్ల మాత్రమే ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దహెగాం, లగ్గాం, సీతానగర్, గుంట్లపేట, కొండపల్లి గ్రామాల్లో మాత్రమే వరి కొనుగోళ్లు సాగుతున్నాయి. మిగిలిన చోట్ల కోతలు ఆలస్యం కావడంతో కేంద్రాలకు ధాన్యం రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు



రెబ్బెన మండలం నంబాల శివారులో దెబ్బతిన్న వరి

ఆసిఫాబాద్‌రూరల్/రెబ్బెన: ఆసిఫాబాద్ మండలంలోని అప్పపల్లి, బూర్గుడ, కొమ్ముగూడ, గొల్లగూడ, ఈదులవాడ, సింగరపేట్, చిర్రకుంట, ఖైర్‌గాం, రెబ్బెన మండలంలోని నంబాల, చిలుకమర్రిగూడ, రాజారాం, కొమురవెల్లి, కిష్టాపూర్, ఎడవెల్లి, కైరిగాం, నక్కలగూడ, పుంజుమేరగూడ, నంబాల గ్రామాల్లో అకాల వర్షం వరి పంటకు నష్టం చేకూరింది. రెబ్బెన మండలంలో సుమారు 50 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అలాగే పులికుంట, నంబాల, ధర్మారం, గోలేటి ప్రాంతాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. మరో 15 రోజుల్లో వరి కోతలు పూర్తవుతాయని అనుకున్న సమయంలో పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టంపై సర్వే చేపట్టి ప్రభుత్వం పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. మండలం యూనిట్‌గా కాకుండా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సర్వే చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏటా నష్టపోతున్నాం



యాసంగిలో ఐదెకరాల్లో వరి సాగు చేసిన.. పంట కోతకు వచ్చింది. ఈ రెండు రోజుల్లో కోద్దామని అనుకున్నా. అంతలోనే మంగళవారం పెద్ద వాన పడ్డది. గాలివానకు వరి కింద పడ్డది. ఎండలు బాగా కొడితే భూమి ఎండిన తర్వాత కోయవచ్చు. దానికి మరో వారం, పది రోజులు పడుద్ది. ఏటా యాసంగిలో నష్టపోతున్నం.

– బుర్రి పెద్ద మల్లేశ్, కర్జి

జోరుగా హోం, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకుంటున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు హోం ఓటింగ్‌ను వినియోగించుకుంటున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 127 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా బుధవారం నాటికి 122 మంది వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 29 మందికి 29 మంది ఓటు వేశారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు బుధవారంతో ముగిసినప్పటికీ ఈ నెల 10 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం 2,420 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 2,039 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 1,415 మంది దరఖాస్తు చేసుకోగా 1,246 మంది ఓటు వేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

జాతీయ చేనేత అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం
ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద సంత్ కబీర్ జాతీయ చేనేత అవార్డు కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి దుస్తుల ఎగుమతి శాఖ సంచాలకులు అలుగు వర్షిణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత డిజైన్ డెవలప్‌మెంట్, ఎస్‌హెచ్‌డీపీ కింద చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ రంగంలో గుర్తింపు కోసం కార్మికులు, డిజైనర్లు, విక్రయదారుల నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నేత విభాగంలో మూడంచెల ఎంపిక ప్రక్రియ(జోనల్, హెడ్‌క్వార్టర్, జాతీయ స్థాయి ఎంపిక కమిటీ) ద్వారా విజేతలను ఎంపిక చేస్తామని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ, మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం https://handlooms.nic.in ను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా హైదరాబాద్‌లోని వీ వర్ సర్వీస్ సెంటర్‌లో సమర్పించాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం
- జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

ఆసిఫాబాద్‌అర్బన్: దేశంలో రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో బుధవారం టీజేఎస్, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం.. పార్లమెంట్ ఎన్నికలు కర్తవ్యం' అనే అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. కోదండరాం మాట్లాడుతూ రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపై నిలిపిందన్నారు. ప్రస్తుతం దేశంలో అసమానతలు పెరిగాయన్నారు. పదేళ్ల క్రితం రూ.లక్ష కోట్ల ఆస్తితో ఉన్న అదానీ ప్రస్తుతం రూ.ఏడున్నర లక్షల కోట్లకు పెరిగితే.. రైతు పరిస్థితి మాత్రం అలాగే ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ వ్యవస్థను బతికించేందుకు ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆరోపించారు. వ్యవసాయం దండగా అని, పట్టణాల్లో సెక్యూరిటీ గార్డుగా పని చేయడం నయం పరిస్థితికి దిగజార్చినట్లు విమర్శించారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పాలనలో రాజ్యాంగం నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమికి ఓటు వేయాల్సిన అవసరం ఉందని వక్తలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, టీజేఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాబన్న, నాయకులు రూప్‌నార్ రమేశ్, దినకర్, కార్తీక్, చిరంజీవి, మాలశ్రీ, సోయం చిన్నయ్య, ధర్మా, చాంద్‌పాషా, శ్యాం, ఆసిఫ్, అసద్, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్



పార్టీలో చేరిన వారితో ఆత్రం సక్కు, దండె విఠల్

కౌటాల(సిర్పూర్): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కౌటాలలోని జగదాంబ గార్డెన్‌లో బుధవారం కౌటాల, సిర్పూర్(టి) మండలాల బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఐదేళ్లలో బీజేపీ ఎంపీ జిల్లాకు ఏం అభివృద్ధి చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. మత రాజకీయాలు చేసే ఆ పార్టీకి ఓటు వేయవద్దన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తమ పార్టీల సభ్యత్వం లేని వారికి అభ్యర్థులుగా టికెట్ ఇచ్చాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాను రద్దు చేస్తుందని ఆరోపించారు. ధైర్యం లేని వాళ్లు పార్టీ నుంచి అధికార పార్టీలోకి వెళ్లిపోయారని, పార్టీలో ఉన్న కార్యకర్తలతోనే బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం బీఎస్పీ నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. బెజ్జూర్ జెడ్పీటీసీ పుష్పలత, మాజీ జెడ్పీటీసీ తిరుపతి, నాయకులు నక్క శంకర్, ఉమా మహేశ్, పత్రు, రవి, శంకర్, నాందేవ్, గోవింద్‌రావు, శంకరయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

వారంటీ లేని హామీలతో మోసం

పెంచికల్‌పేట్: వారంటీ లేని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు పెట్టుబడి సాయం, రుణమాఫీ అమలు చేయడంలో విఫలమైందన్నారు. మరోవైపు కేంద్రంలో ఉన్న బీజేపీ కేవలం మతం పేరుతో ఓట్లు అడగడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు బిట్టి శ్రీనివాస్, తిరుపతి, కృష్ణ, శంకర్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దూకుడుగా ప్రచారం!

- ఇంటింటికీ తిరుగుతూ.. పని ప్రదేశాల్లో ఓటర్లను కలుస్తూ
- అభ్యర్థుల గెలుపు కోసం శ్రమిస్తున్న ప్రధాన పార్టీల నేతలు
- ఆన్‌లైన్ ప్రచారంతో హోరెత్తిస్తున్న వైనం





ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు దూకుడు పెంచాయి. ఆ పార్టీల ముఖ్య నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు అభ్యర్థుల గెలుపు కోసం శ్రమిస్తున్నారు. ఆదిలాబాద్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు బీజేపీ ప్రణాళికలు రూపొందిస్తుండగా.. ఎలాగైనా ఎంపీ స్థానాన్ని హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ యత్నిస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్ సైతం ప్రచారంలో దూసుకుపోతుంది. ఇప్పటికే ఆసిఫాబాద్‌లో జనజాతర పేరిట నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. స్థానికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకున్నా ఇన్‌చార్జి మంత్రిగా జిల్లా అభివృద్ధి బాధ్యతలు తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మరో వైపు కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం మైదానంలో నిర్వహించిన సభకు కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరై ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

చేరికలతో కాంగ్రెస్‌లో జోష్

జిల్లాకు చెందిన వరుసగా కాంగ్రెస్‌లో చేరుతుండటంతో ఆ పార్టీలో జోష్ పెరిగింది. జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే స్థానం గెలవకున్నా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌తోపాటు మాజీ ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, మైనార్టీ నాయకులు అబ్దుల్లా, గోపాల్‌నాయక్ తదితరులు హస్తం గూటికి చేరుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు ఆధ్వర్యంలో వీరు జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నారు. ఆ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం కృషి చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కీలక నేతలు కాంగ్రెస్‌లో చేరడం కలిసి వస్తుందని భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, ఉపాధిహామీ పని ప్రదేశాల్లోనూ ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

గడపగడపకూ బీజేపీ

ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీలు గడపగడపకూ వెళ్లి ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు దీటుగా బీజేపీ క్షేత్రస్థాయిలో వేగం పెంచింది. గతంలో జిల్లాలో బీజేపీకి క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ లేదు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ సోదరులతోపాటు వారి అనుచరుల చేరికతో ఆ పార్టీకి బలం పెరిగింది. గతంలో ఎమ్మెల్యేల గెలుపులో కీలక పాత్ర పోషించిన అరిగెల సోదరులు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ గెలుపు కోసం పావులు కదుపుతున్నారు. మరోవైపు ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేసింది. అక్కడ పాల్వాయి హరీశ్‌బాబు పార్టీ విస్తరణకు కీలకంగా మారారు. ఇటీవల కాగజ్‌నగర్ సభలోనూ స్థానిక అంశాలను ప్రస్తావించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

సక్కు గెలుపునకు పావులు

జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దండె విఠల్ బీఆర్‌ఎస్ గెలుపు బాధ్యతలు ఎత్తుకున్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు పావులు కదుపుతున్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ బలమైన క్యాడర్ ఉండటంతో అసెంబ్లీ ఎన్నికల్లో కోవ లక్ష్మి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని వదులుకున్న సక్కు గెలుపు కోసం తీవ్రంగా పాటుపడుతున్నారు. అయితే ఇటీవల కీలక నేతలు పార్టీని వీడటం మైనస్‌గా మారింది. ప్రచారంలో భాగంగా జిల్లాలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోనప్ప పార్టీని వీడటంతో క్యాడర్‌ను ముందుకు నడిపించే బాధ్యతను ఎమ్మెల్సీ దండె విఠల్ తీసుకున్నారు. పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం, బెజ్జూర్ మండలాల్లో ప్రచారం చేస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఆత్రం సక్కుతో కలిసి వరుస సభలు నిర్వహిస్తున్నారు.

వాయిస్ కాల్స్ ప్రచారం

- గెలుపు కోసం ప్రధాన పార్టీల కొత్తదారి



కెరమెరి(ఆసిఫాబాద్): ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో కొత్తదారులు ఎంచుకుంటున్నారు. ఎండల తీవ్రతకు పూర్తిస్థాయిలో ఓటర్లను నేరుగా కలిసే అవకాశం లేకపోవడంతో మొబైల్ ఫోన్ల ద్వారా వాయిస్ కాల్స్ చేయిస్తున్నారు. రికార్డు వాయిస్‌తో తమనే గెలిపించాలని ఓటు అభ్యర్థిస్తున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో మూడు జిల్లాల్లో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. చాలా వరకు గిరిజన గ్రామాలు కావడంతో ప్రయాణం అంత సులువు కాదు. దీంతో అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు.

ఎండలకు తిరగలేక..

ఉమ్మడి జిల్లాలో కొద్దిరోజులు పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్న విషయం తెలిసిందే. మంగళవారం మాత్రమే వాతావరణం చల్లబడి పలుచోట్ల వర్షం కురిసింది. ఉదయమే ఉపాధిహామీ పనులకు ప్రజలు వెళ్తుండటంతో నాయకులు కూలీలను నేరుగా కలిసి ఓటు వేయాలని కోరుతున్నారు. మళ్లీ ఎక్కువగా సాయంత్రం 5 గంటల తర్వాతే ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్, సోషల్ మీడియాలోనూ ప్రచారం చేస్తున్నారు. తక్కువ సమయంలోనే ఎక్కువ మంది ఓటర్లను చేరుకునేందుకు వాయిస్ కాల్ ప్రచారాన్ని ఎంచుకున్నారు. అయితే ప్రతిరోజూ వివిధ పార్టీల నుంచి ఫోన్ కాల్స్ వస్తుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

దాడికి పాల్పడిన కేసులో ఒకరికి జైలు

మంచిర్యాలక్రైం: ముగ్గురిపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తికి స్థానిక న్యాయమూర్తి అర్పిత మారంరెడ్డి ఐదేళ్ల జైలుశిక్ష రూ.వెయ్యి జరిమానా విధించినట్లు స్థానిక సీఐ బన్సీలాల్ తెలిపారు. 2016 సెప్టెంబర్ 17న మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘడ్పూర్ గ్రామ పంచాయతీలోని బాబానగర్‌కు చెందిన సంద్ర లక్ష్మణ్, అనిల్, అశోక్‌పై అదే గ్రామానికి చెందిన మనుబోతుల శ్రీనివాస్ గొడ్డలి, కత్తితో దాడిచేసి గాయపరిచాడు. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై వేణుగోపాల్‌రావ్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ మదన్‌మోహన్‌రావ్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి జైలుశిక్ష ఖరారు చేశారు.

ఒకరి అదృశ్యం


మహేష్ (ఫైల్)

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంకతివాడకు చెందిన మహేష్ (30) అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. మీసేవలో పనిచేస్తున్న మహేష్ ఈనెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ రావడంతో అతని మేనమామ లచ్చయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

కోటపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన డొబ్బల సంపత్ ద్విచక్ర వాహనంపై పార్‌పల్లి జాతీయ రహదారి మీదుగా చెన్నూర్‌కు వెళ్తుండగా చీకట్లో ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంలోంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అటుగా వెళ్తున్న బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్ అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. సంపత్‌ను అంబులెన్స్‌లో తరలించడంతో పాటు రూ.5వేలు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు.

మత్తులో పల్లెలు

- గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాల జోరు
- కానరాని కట్టడి చర్యలు
- అంతంతమాత్రంగా దాడులు


పెద్దదుబ్బ శివారు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ధ్వంసం చేసిన నాటుసారా బట్టీ (ఫైల్)

బెల్లంపల్లి/చెన్నూర్: గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు అడ్డగోలుగా సాగుతున్నాయి. పల్లె ప్రాంతాలను ఆనుకుని ఉన్న అటవీ శివారు ప్రాంతాలను ఎంచుకుని నాటుసారా తయారు చేస్తున్నారు. కొందరు రహస్య ప్రాంతాల్లో గుడుంబా తయారు చేసి పాలిథిన్ కవర్లలో నింపి ఇతర గ్రామాలకు తరలించి అమ్మకాలు చేస్తున్నారు. ఎక్సైజ్, పోలీసుల నియంత్రణ చర్యలు అంతంతమాత్రం కావడంతో 'మూడు బట్టీలు.. ముప్పై సీసాలు'గా గుడుంబా ఉత్పత్తి చేసి క్రయ విక్రయాలు చేస్తున్నారు.

అటవీ శివారు ప్రాంతాలే అడ్డా..

అసెంబ్లీ నియోజకవర్గంలో బెల్లంపల్లి, తాండూర్, నెన్నెల, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి, కాసిపేట మండలాల్లోని వివిధ గ్రామాల అటవీ శివారు ప్రాంతాలు, వాగులు, చెట్ల పాదలమాటున బట్టీలు ఏర్పాటు చేసి డ్రమ్ముల కొద్దీ నాటుసారా తయారు చేస్తున్నారు. ఇటీవల బెల్లంపల్లి మండలం పెద్దదుబ్బ గ్రామ అటవీ శివారు ప్రాంతంలో రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి గుడుంబా బట్టీలను ధ్వంసం చేయడం అందుకు నిదర్శనంగా నిలుస్తోంది. వాగులను ఆనుకుని డ్రమ్ముల్లో రోజువారీగా వేల లీటర్ల గుడుంబా ఉత్పత్తి చేస్తున్నారంటే నమ్మశక్యం కాకున్నా నమ్మితీరాల్సిన వాస్తవమని గ్రామీణులు పేర్కొంటున్నారు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో....

బెల్లంపల్లి మండలంలోని మాలగురిజాల, లంబాడి తండా, పెర్కపల్లి, రంగపేట, బట్వాన్‌పల్లి, పెద్దదుబ్బ, ఆకెనపల్లి, చంద్రవెల్లి, చాకేపల్లి తదితర గ్రామాల్లో, కన్నెపల్లి మండలంలోని కన్నెపల్లి, జన్కాపూర్, దాంపూర్, నాయకునిపేట, ఎల్లారం, తదితర పల్లెల్లో, వేమనపల్లి మండలంలోని బుయ్యారం, నాగారం, జాబులపేట, వేమనపల్లి, సుంపుటం గ్రామాల్లో, నెన్నెల మండలంలోని లంబాడితండా, చిత్తాపూర్, ఆవుడం, గ్రావణ్‌పల్లి, జెండా వెంకటాపూర్, ఖర్జీ, దమ్మిరెడ్డిపేట, కొత్తగూడ, మైలారం, తాండూర్ మండలంలోని తంగళ్లపల్లి, నీలయ్యపల్లె, మాదారం త్రీ, మాదారం 5 ఇంక్లైన్, అచ్చులాపూర్, భీమిని మండలంలోని చిన్నగుడిపేట, భీమిని, కేస్లాపూర్, కాసిపేట మండలంలోని కర్షలఘటం, వరిపేట, కోమటిచేన్ గిరిజన గ్రామాలు గుడుంబా తయారీకి కేంద్రాలుగా ఉన్నాయి. పలు గ్రామాల్లో నాటుసారా తయారీ అవుతుండగా ఇతర గ్రామాలకు ప్యాకెట్ల రూపంలో రవాణా చేసి విక్రయాలు చేస్తున్నారు.

ప్రమాదకరమైన పదార్థాలతో తయారీ..

అత్యంత హానికరమైన పదార్థాలతో నాటుసారా తయారుచేస్తున్నారు. ఇప్పపూల వాసన లేకపోగా బెల్లం, పటిక, యూరియా, కుళ్లిపోయిన పండ్లు, అరటి తొక్కలు, చివరికి తోలుచెప్పులను ఆయా పదార్థాలతో పులియబెట్టి గుడుంబా కాస్తున్నారు. నిషా రావడానికి కొందరు ఎండ్రీన్ సీసాలో చీపురు పుల్లను ముంచి ఆ పుల్లకు అంటిన ఎండ్రీన్‌ను తయారైన గుడుంబాలో కలిపేస్తున్నారు. ఆ నాటు సారాను తాగిన మద్యం ప్రియులు మత్తులో తేలియాడుతున్నారు. అందుకే బ్రాంది జోలికి వెళ్లకుండా అత్యధిక మంది గుడుంబాకు ఆకర్శితులవుతున్నారు. ఇంత జరుగుతున్నా గ్రామాలల్లో ఎక్సైజ్, పోలీసుల దాడులు కానరావడం లేదు. అడపాదడపా మొక్కుబడిగా దాడులు చేసి నట్లు చేసి మమ అనిపిస్తున్నారు. వాహనాల తనిఖీల్లో పట్టుబడుతున్న గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారే తప్పా చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

దాడులు నిర్వహిస్తున్నాం

నాటుసారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాం. రోజువారీగా నిర్ధేశించిన గ్రామాల్లో ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తున్నాం. నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్నాం. కాచిన సారాను స్వాధీనం చేసుకుని తయారీదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. కౌన్సిలింగ్ నిర్వహించి తప్పుడు పద్ధతులు మానాలని సూచిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా నాటుసారా తయారుచేసినా విక్రయించినా ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– జి.ఇంద్రప్రసాద్, ఎక్సైజ్ సీఐ, బెల్లంపల్లి

బెల్ట్‌షాపుల బంద్‌తో..

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సుమారు నాలుగు నెలలు, ప్రస్తుత ఎంపీ ఎన్నికల సందర్భంగా రెండు నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు బంద్ అయ్యాయి. దీంతో మద్యం ప్రియులు గుడుంబాను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. మద్యం ప్రియుల అలవాట్లను ఆసరా చేసుకొని గుడుంబా తయారీ కేంద్రాలు వెలిసినట్లు ప్రచారం జరుగుతోంది.

'బీజేపీని గద్దె దించాలి'

శ్రీరాంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం ఆర్కే 6 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేయడం, బొగ్గు గనులను ప్రైవేటు పరం చేయడం, కార్మిక చట్టాలను సవరించి వ్యతిరేక చట్టాలను చేసి కార్మికవర్గానికి నష్టం కలిగించారన్నారు. ఇలాంటి సర్కార్‌కు ఈ ఎన్నికల్లో ఓటర్లు బుద్ధి చెప్పి పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ గెలిస్తే సింగరేణిలో సొంతింటి పథకం, పెర్క్స్‌పై ఆదాయ పన్ను మాఫీ చేస్తామని హామి ఇచ్చారన్నారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమయ్య, బ్రాంచి సెక్రెటరీ బాజీసైదా, నాయకులు చంద్రమోహన్ పాల్గొన్నారు.

'శబరిమలలో టీటీడీ మాదిరిగా సౌకర్యాలు కల్పించాలి'

మంచిర్యాలఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా కేరళ ప్రభుత్వం శబరిమలలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలేరావు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేరళా ట్రావెన్ కోర్ దేవస్థానం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోరాదన్నారు. రోజుకు 80 వేల మంది భక్తులకు మాత్రమే అయ్యప్ప దర్శనం చేసుకునేలా వర్చువల్ (ఆన్‌లైన్) బుకింగ్‌పై పరిమితి విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. శబరిమలకు రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతున్నందువల్ల కేరళ ప్రభుత్వం ట్రావెన్ కోర్ దేవస్థానం వసతులు పెంచి అధిక సంఖ్యలో దర్శనం చేసుకునేలా చూడాలన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కొత్త గనులు

శ్రీరాంపూర్: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కొత్త గనులు త్వరగా వస్తాయని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. బుధవారం ఎస్సార్పీ 3, 3ఏ, ఎస్సార్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని కొత్త గనుల ఏర్పాటు కొరకు అవసరమైన చర్యలు చేపడుతుందని, ఇదే సమయంలో కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సింగరేణికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం గద్దె దిగితేనే బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆగుతుందన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించామని, వాటి పరిష్కారానికి వారు సానుకూలంగా ఉన్నారన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే సింగరేణి కార్మికులకు కొత్త హక్కులు, సదుపాయాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు కావాలంటే కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, కేంద్ర నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

'వంశీకృష్ణను రెండు లక్షల మెజార్టీతో గెలిపిస్తాం'


చెన్నూర్‌లో ఎమ్మెల్యే వివేక్ రోడ్డు షో

చెన్నూర్: ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను రెండు లక్షల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తామని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం జలాల్ పెట్రోల్ బంక్ నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై ప్రజలకు నమ్మకం కలిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజారంలో ఎమ్మెల్యే వివేక్ పర్యటన

కోటపల్లి: మండలంలోని కొత్తపల్లి రాజారం గ్రామ పంచాయతీలో బుధవారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో అభివృద్ధి జరగడంలేదని, పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు గ్రామస్తులు తీర్మానం చేశారు. దీంతో ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించగా గ్రామస్తులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎన్నికల బహిష్కరణ సమస్యకు పరిష్కారం కాదని, ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు సూచించారు. ఎన్నికల కోడ్ ముగియగానే గ్రామంలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం'


మాట్లాడుతున్న గడ్డం వంశీకృష్ణ

భీమిని: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఆపార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం భీమిని, కన్నెపెల్లి మండలాల్లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పదేళ్లలో దేశాన్ని భ్రష్టుపట్టించిందన్నారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేద ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ ఎన్నికల్లో వంశీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాదరవరపు నర్సింగరావు, భీమిని, కన్నెపెల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, నాయకులు శ్రీహరిరావు, రాకేష్ శర్మ, సంతోష్‌కుమార్, నవీందర్ రావు, బట్టు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు పచ్చని తోరణాలు


కాన్కూర్ రోడ్డుకు రెండువైపులా తోరణాలుగా చెట్లు

మండలంలోని కాన్కూర్–గుడిపెల్లి గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా తోరణాలుగా ఉన్న పచ్చని చెట్లు ఆహ్లాదం పంచుతున్నాయి. ఒకవైపు మండుతున్న ఎండలకు అల్లాడిపోతున్న ప్రజలు, వాహనదారులకు చల్లని నీడనిస్తున్నాయి. – జైపూర్

పాకురు నీళ్లలో ఈదేదెలా?

- పంపింగ్ మోటార్లు పనిచేయక రీసైక్లింగ్ కాని వాటర్
- నెలరోజులుగా అస్తవ్యస్తంగా స్విమ్మింగ్ పూల్
- నిర్వహణ లోపమే ప్రధాన కారణమని అభిప్రాయాలు


ఆకుపచ్చ రంగులోకి మారిన నీరు


మరమ్మతులకు నోచుకోని మోటార్లు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్ అస్తవ్యస్తంగా మారింది. నీరు ఎప్పటికప్పుడు రీసైక్లింగ్ కాకపోవడంతో నీలిరంగు టైల్స్‌కు నిలువుటద్దం పట్టే నీళ్లు ముదురు ఆకుపచ్చ రంగులో దర్శనమిస్తున్నాయి. పంపింగ్ మోటర్లు పనిచేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. మోటార్ల మరమ్మతులకు రూ.2 లక్షల వ్యయం అవుతుందని తెలిసి చేతులెత్తేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. పర్యావసానంగా సమ్మర్ కాలాన్ని సరదాగా ఈతకొలనులో సాగిద్దామని భావించిన విద్యార్థులు, యువత నిరాశ, నిస్పృహకు గురవుతోంది. ఇలాంటి నీటిలో ఈది అంటువ్యాధులు కొనితెచ్చుకోవడం దేనికని సంశయానికి గురవుతోంది. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు వారి పిల్లలతో పాటు బయటవారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ నేడు ఇలా మారటం గమనార్హం.

మరమ్మతులకు రూ.2 లక్షలు ..

ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న పంపింగ్ మోటర్ల మరమ్మతులకు రూ.2 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీంతో పనులకు బ్రేక్ పడింది. దాదాపు 150 మంది విద్యార్థులు, యువకులు రోజువారీ స్విమ్మింగ్ చేసేందుకు వస్తుంటారు. ఉద్యోగుల పిల్లలకైతే రూ.100, కార్మికేతరులకు రూ.500, వారి పిల్లలకు రూ.400 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య రిపోర్ట్ సబ్‌మిట్ చేయాలి. ఇన్ని చేసి నేడు ఈతకు వెళ్తామంటే భయమేస్తోందని విద్యార్థులు, యువత వాపోతున్నారు. ఆకుపచ్చ రంగులో ఉన్న నీటిలో ఈది లేనిపోని వ్యాధులు కొనితెచ్చుకోవడం దేనికని అంటున్నారు. లక్షల వ్యయంతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ ఇలా సేవలకు దూరంగా ఉంటే ఎలాగని మదనపడుతున్నారు.

మరమ్మతులు చేపట్టండి సారూ..

ఇప్పటికే రామకృష్ణాపూర్‌లో అన్నింటినీ మూసివేస్తూ వస్తున్న సింగరేణి ఉన్నతాధికారులు స్విమ్మింగ్ పూల్‌ను సైతం ఎత్తివేసే యోచనలో ఉన్నారా? అనే సందేహాలు లేకపోలేదు. కొద్దిరోజులుగా ఇలాంటి పరిస్థితే ఉండటంతో సహజంగానే ఈ అనుమానం కలుగుతోంది. కార్మికులు వారి పిల్లల సందేహం దూరం కావాలంటే ఇప్పటికైనా అధికారులు స్పందించి స్విమ్మింగ్ పూల్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన మోటార్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అకాల వర్షానికి కూలిన ఇల్లు


ఖిరిడిలో కూలిన పెంకుటిల్లు

వాంకిడి: మంగళవారం ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి మండలంలోని ఖిరిడి గ్రామంలో సురేష్‌కు చెందిన పెంకుటిల్లు కుప్ప కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సురేష్‌కు చెందిన ద్విచక్రవాహనం ధ్వంసమైంది. అకాల వర్షంతో తనకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

భూమిలో కలిసిన ఇంకుడు గుంతలు


మట్టితో నిండిన ఇంకుడు గుంత

భీమారం: గతంలో భీమారం అడవుల్లో అటవీశాఖ నిర్మించిన ఇంకుడుగుంతలు ప్రస్తుతం భూమిలో కలిసి పోయాయి. దీంతో వర్షాకాలంలో వరద నీరు వాగుల్లోకి వృథాగా పోతోంది. పదిహేనేళ్ల క్రితం అటవీశాఖ వర్షం నీటిని వృథాగా పోనీయకుండా అక్కడక్కడా ఇంకుడు గుంతలు నిర్మించింది. దీంతో వర్షపు నీరు అందులోనే నిల్వ ఉండి భూమిలోనే ఇంకిపోయేలా చర్యలు చేపట్టారు. కానీ వాటిలో ఉన్న మట్టిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో నేడు అవి మట్టితో నిండి పోయాయి. తిరిగి నిర్మించాల్సి ఉండగా వాటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడంలేదు. మరో నెల రోజుల్లో వర్షాలు కురియనున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా చేపడుతున్న ఉపాధి పనుల్లో భాగంగా అడవుల్లో ఇంకుడు గుంతలు నిర్మిస్తే బాగుంటుందని ప్రజలు సూచిస్తున్నారు.

వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: అయోధ్య రామమందిరం నిర్మాణంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ వ్యాఖ్యలకు నిరసనగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. బుధవారం శ్రీరాంపూర్ బస్టాండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడారని అన్నారు. వారు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు కనకతార, జిల్లా కార్యదర్శి వేముల రమేశ్, బజరంగ్‌దళ్ పట్టణ నాయకులు కొర్ర నాగార్జున, నాయకులు పెర దివ్య, రాకేశ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ధాన్యం కమీషన్ పెండింగ్

- ఇబ్బందులు పడుతున్న మహిళా సంఘాల సభ్యులు


ధాన్యం తూకం పరిశీలిస్తున్న నిర్వాహకులు(ఫైల్)

పాతమంచిర్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులకు కమీషన్ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 135 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 100 కేంద్రాలను మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం క్వింటాకు రూ.32 కమీషన్ ఇస్తుంది. ఇందులోనే నిర్వాహకులు టెంట్, ఫ్లెక్సీలు, నీటి వసతి, ట్యాబ్‌ల కొనుగోలు, తేమ కొలిచే సాధనాలు సమకూర్చు కోవాల్సి ఉంటుంది. సెంటర్‌లో పని చేసినందుకు కూలీ కూడ కమీషన్ నుంచే తీసుకోవాల్సి ఉంటుంది. సెంటర్‌ల నిర్వహణ ద్వారా వచ్చిన కమీషన్ నిర్వాహకులు కూలీ డబ్బులు, ఇతర ఖర్చులు పోనూ మిగిలిన మొత్తాన్ని మహిళా సంఘాల సభ్యులు రుణంగా తీసుకుని వడ్డీతో సహా మహిళా సంఘం ఖాతాలో జమ చేస్తారు. మహిళా సంఘాల ద్వారా 2022–24 ఖరీఫ్ సీజన్ వరకు 3,97,298 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. కానీ 2022–23 ఖరీఫ్, యాసంగి, 2023–24 ఖరీఫ్‌కు సంబంధించిన కమీషన్ రూ.2,38,57,694 ప్రభుత్వం విడుదల చేయలేదు. కొనుగోళ్ల సీజన్ ముగిసిన తర్వాత కమీషన్ డబ్బులు విడుదలవుతాయని నిర్వాహకులు ఆశపడినా కమీషన్ రాకపోవడంతో నిరాశే ఎదురౌతుందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విడుదల చేయాలి

2020లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కమీషన్ రూ.2 లక్షల వరకు రావాల్సి ఉంది. సొంత ఖర్చులతో సెంటర్ నిర్వహించాం, అప్పులు చేసి సామాగ్రి కొనుగోలు చేసుకున్నాం. నాలుగేళ్లు సెంటర్ నిర్వహణ తీసుకోలేదు. 2024 యాసంగి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. పెండింగ్ కమీషన్ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గుర్రాల కళావతి, ప్యాడి సెంటర్ నిర్వాహకురాలు, దొనబండ

రూ.2 లక్షలు రావాలి

వరిధాన్యం కొనుగోలు కమీషన్ రూ.2 లక్షలు రావాల్సి ఉంది. కమీషన్ గురించి అధికారులను అడుగుతుంటే సమాధానం ఇవ్వడం లేదు. కష్టపడి సెంటర్ నడిపించాం. మా కష్టానికి ఫలితం దక్కడంలేదు. కమీషన్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం.

– ఆత్రం యశోద, సెంటర్ నిర్వాహకురాలు